కాంచర... ఆరోగ్యానికి ఆసరా..

- మార్కెట్‌లో విస్తారంగా విక్రయాలు
- మధుమేహ రోగులకు ఎంతో మేలు
- కిలో రూ. 400 వరకు పలుకుతున్నవైనం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆరోగ్యమే మహాభాగ్యం... వ్యాయామంతోపాటు నేటి యువకులు, పెద్దలు ఆహారంపైన దృష్టి సారిస్తున్నారు. ఏ కాలంలో ఏ పండ్లు, కూరగాయలు పండుతాయో తెలుసుకుంటూ ఆయా కాలాల్లో వచ్చే పండ్లు, కూరగాయలను కొనుగోలు చేస్తూ ముందుకు వెళుతున్నారు. అయితే ఎక్కువమంది మధుమేహంతో బాధపడేవారు ఉన్నారు. దీంతో తాజాగా కాంచర కాయలపై ఎక్కువ మక్కువ చూపుతున్నారు.

కిలో రూ. 400కు పైమాటే

కాంచర కాయలు కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి, హోస్పేట తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. కడప రైతు బజారు, పెద్ద మార్కెట్ తోపాటు కొన్ని కూడళ్లల్లో, బండ్లపైన కనిపిస్తున్నాయి. అయితే కిలో ధర రూ. 400కు పైగా పలుకుతోంది. ఎక్కువ మంది ఈ కాయలు తీసుకొచ్చి లాభానికి విక్రయిస్తున్నారు.

ఆరోగ్యానికి ఎంతో మేలు

కాంచర కాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వైద్యులు సూచిస్తుండడంతో ఎక్కువ మంది వీటిపైన ఆసక్తి చూపుతున్నారు. పల్లెవాసులు గతంలో ఎక్కువగా ఆహారంలో తీసుకుంటుండగా, పట్టణాల్లో కూడా వాడకం పెరిగింది. ఇవి చేదు గుణం కలిగి ఉండడం, సహజ సిద్ధంగా లభిస్తుండడం, షుగర్ వ్యాధిని అదుపులో ఉంచే గుణం కలిగి ఉండడంతో వైద్యులు సైతం వీటిని ఆహారంలో చేర్చాలని సూచిస్తున్నారు.



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న కాంచర కాయలు

ధర అధికంగా ఉన్నా...



కాంచర కాయలు మార్కెట్‌లో డిమాండ్ బాగా ఉంది. ధర కిలో రూ. 400 పలుకుతోంది. అయినా ఆరోగ్యానికి మంచిదని కొంటున్నాం. ముఖ్యంగా షుగర్ వ్యాధిగ్రస్తులు ఇవి తింటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. – డి.దేవరాజు, కడప

ఆరోగ్యానికి ఎంతో మంచిది



కాంచర కాయలు మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. మధుమేహం అదుపులో ఉంచేందుకు ఇవి బాగా పనిచేస్తాయి. అలాగే మలబద్ధకంతో బాధపడుతున్న వారు, పైల్స్ వ్యాధిగ్రస్తులు వీటిని తినడం ఎంతో మంచిది. అయితే ఇవి చేదుగా ఉన్నందున తినేందుకు అలవాటుగా మార్చుకోవాల్సిన అవసరం ఉంది. – డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, వైద్య నిపుణులు, ఏపీఎస్ ఆర్టీసీ ఏరియా ఆస్పత్రి, కడప

క్లుప్తంగా

17న జిల్లా వర్క్ షాపు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 17న బద్వేలు పట్టణంలో జరిగే డీవైఎఫ్ఐ జిల్లా వర్క్ షాపును జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో జిల్లా వర్క్‌షాప్‌కు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడప ఉక్కు పరిశ్రమ, రాయలసీమకు బుందేల్ఖండ్ తరహా ప్యాకేజీ కేంద్రం ఇవ్వడంలో తీవ్ర జాప్యం వహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు ముడియం చిన్ని, జిల్లా ఉపాధ్యక్షుడు సహాయ కార్యదర్శి అంజి పాల్గొన్నారు.

నూతన మ్యూజియాన్ని ఏర్పాటుచేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లా ప్రజలకు ఏకైక మ్యూజియంగా ఉన్న శ్రీ భగవాన్ మహావీర్ మ్యూజియం శిథిలావస్థకు చేరుకుందని, ఈ పురాతన ప్రదర్శనశాలను అధికారులు గాలికి వదిలేశారని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి తెలిపారు. బుధవారం మహావీర్ మ్యూజియాన్ని ఆర్‌సీపీ నాయకులు సందర్శించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా స్థాయి పురవాస్తు అధికారులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నూతన మ్యూజియాన్ని అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌సీపీ నగర కార్యదర్శి మక్బుల్ బాషా, కార్యదర్శి వర్గ సభ్యులు ప్రసాద్, తస్లీమ్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు బెదిరింపులు మానుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: చిన్నచిన్న ఉద్యోగులను, కార్మికులను రాజకీయాలతో ముడిపెట్టి అధికార పార్టీ నాయకులు బెదిరిస్తున్నారని, ఇది తగదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం, అంగన్వాడీ, ఆశా, హాస్టల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, చిరు కార్మికులను తొలగించి, వారి స్థానంలో తమ పార్టీ వాళ్లను నియమించుకోవాలనే అధికార పార్టీ నేతల ఆలోచన దుర్మార్గమని, అలాంటి ఆలోచనలు మానుకోవాలని హితవు పలికారు. చిరు ఉద్యోగులను, కార్మికులను తొలగిస్తే ఉద్యమాలకు సన్నద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జి. వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ.బాదుల్లా, నగర కార్యదర్శి మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ పీజీ పరీక్షల తనిఖీ



పరీక్షలను పరిశీలిస్తున్న ఆచార్య రఘునాథరెడ్డి

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలో జరుగుతున్న పీజీ సెమిస్టర్ పరీక్షలను వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రఘునాథరెడ్డి తనిఖీ చేశారు. వైవీయూ ఆర్ట్స్ బ్లాక్‌లో జరుగుతున్న కేంద్రానికి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ ఈశ్వర్ రెడ్డితో కలసి పరిశీలించారు. పరీక్షల నిర్వహణ తీరుపై ఇన్విజిలేటర్లుతో మాట్లాడారు.

టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ రామారావు మృతి



కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ కె. వెంకట రామారావు(42) మంగళవారం రాత్రి కన్నుమూశారు. వివరాలిలా ఉన్నాయి...రామారావు ప్రకాశం జిల్లా గిద్దలూరులోని రాజన్నపేటకు చెందిన వారు కాగా నంద్యాలలో నివాసం ఉంటున్నారు. ఈనెల 6వ తేది నంద్యాలకు వెళ్లిన ఆయన ఆదివారం అస్వస్థతకు గురయ్యాడు. గుండెనొప్పిగా గుర్తించిన వైద్యులు హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం స్వగ్రామం రాజన్నపేటలో అంత్యక్రియలు ముగిశాయి.

ప్లే గ్రౌండ్ లేని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లకు సంబంధించి ప్లే గ్రౌండ్ లేని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం డీఈఓ మర్రెడ్డి అనురాధను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చాలా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలకు వ్యతిరేకంగా అపార్టుమెంట్, షాపింగ్ కాంప్లెక్స్‌లు, రేకుల షెడ్లలో తరగతులను నిర్వహిస్తున్నాయన్నారు. కొన్ని పాఠశాలలకు పార్కింగ్ ప్లేసు కూడా లేదన్నారు. అధికారులు స్పందించి సంబంధిత పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి

- కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ తక్షణమే రద్దు చేసి స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు పెంచాలని కోరారు. కేంద్ర బీజేపీ సర్కార్ 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్స్ తీసుకు రావడం అన్యాయమన్నారు. కడపలో స్టీల్ ప్లాంట్ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. దేశంలోని ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించడం చేతగాని తనానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మున్సిపల్, విద్యుత్, ఆశా, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఆప్కాస్ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే వారిని పర్మినెంట్ చేయాలన్నారు. అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ఎస్ఎస్ఏ, విద్య, వైద్య రంగాల్లోని వారికి జీతాలు పెంచడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, మెడికల్ యూనియన్ జిల్లా కార్యదర్శి శంకర్ నారాయణ, మున్సిపల్ విభాగం నగర అధ్యక్షులు రవి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్‌తో భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ హెచ్చరించారు. బుధవారం అంగన్వాడీల కోర్కెల దినోత్సవం సందర్భంగా ఆర్డీవో కార్యాలయం ఎదుట సమస్యల పరిష్కారం కోసం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని కోరారు. గ్రాడ్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులు ఆపాలని చెప్పారు. లేబర్ కోడ్ రద్దు చేయాలని తెలిపారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీదేవి, నగర కార్యదర్శి ఎంపి అంజనీదేవి మాట్లాడుతూ 42 రోజుల సమ్మె కాలంలో ప్రభుత్వం అంగీకరించిన అంశాలకు జీవోలు విడుదల చేయాలని పేర్కొన్నారు. అంగన్వాడీ ప్రీ స్కూల్స్ బలోపేతం చేయాలని చెప్పారు. అనంతరం ఆర్డీఓ వెంకటపతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, ఐద్వా జిల్లా అధ్యక్షులు ఐ. ఎన్. సుబ్బమ్మ, నాయకులు వసుంధర, కవిత, పోలమ్మ, సునీత, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న సీఐటీయూ, అంగన్వాడీ యూనియన్ నాయకులు

వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



క్రీడాశాఖ మంత్రి మండిపల్లికి వినతిపత్రం ఇస్తున్న ఏపీ పీఈటీస్ అండ్ ఎస్‌ఏ అసోసియేషన్ నాయకులు

కడప స్పోర్ట్స్: రాష్ట్రంలోని వ్యాయామ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ పీఈటీస్ అండ్ ఎస్‌ఏ (పీఈడీ) అసోసియేషన్ నాయకులు కోరారు. బుధవారం పులివెందులలో రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రామప్రసాద్‌రెడ్డిని వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం. ప్రవీణ్‌కిరణ్, ఎం. శ్రీకాంత్‌రెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు పాఠశాలల్లో ప్రతి 250 మంది విద్యార్థులకు 1 పీఈటీ/పీడీలను, 251 నుంచి 500 వరకు 2 పీఈటీ/పీడీలు, 501 నుంచి 750 వరకు విద్యార్థులున్న చోట 3 పీఈటీ/పీడీల చొప్పున పోస్టులు మంజూరు చేయాలని కోరారు. అర్హత కలిగిన పీఈటీలకు బీపీఈడీ చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు



జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎన్జీఓ నేతలు

కడప రూరల్ : ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి బి.రవి కుమార్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ శివశంకర్‌ను కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకు వెళ్లడానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా ప్రజల ఆర్థికాభివృద్ధికి కృషి చేద్దామన్నారు. అందుకు ఉద్యోగులపాత్ర ఎంతో కీలకమైందన్నారు. కార్యక్రమంలో తిమ్మారెడ్డి, నిత్యపూజయ్య, శ్రీనివాసులు, బాల పుల్లయ్య, రాజశేఖర్, పోలిరెడ్డి, నరసింహారెడ్డి, గౌరీ, సువాసిని తదితరులు పాల్గొన్నారు.

15న కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వ కార్పొరేషన్ల ద్వారా ఆయా వర్గాలకు రుణాలు మంజూరు చేసే విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ రాష్ట్ర పిలుపులో భాగంగా ఈనెల 15వ తేది కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో లబ్ధిదారులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు ఇచ్చేవారని తెలిపారు. అయితే ఆ తర్వాత కాలంలో అవి పూర్తిగా నిలిచిపోయాయన్నారు. మళ్లీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇవ్వాలని కోరుతూ రాష్ట్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అగ్రవర్ణ పేదలకు 50 ఏళ్లకే పింఛన్ ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో సమానంగా ఓసీ కులాల్లోని పేదలకు కూడా 50 సంవత్సరాలకే పింఛన్‌ను మంజూరు చేయాలని ఓసీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కందనూరు వెంకటసుబ్బారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం కడపలోని ఓసీ సంఘ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు 50 సంవత్సరాలకే పింఛన్ ఇస్తామని చెప్పారన్నారు. కానీ అగ్రవర్ణ పేదలైన బ్రాహ్మణ, వైశ్య, రెడ్డి, కమ్మ, కాపు తదితర కులాలలోను పేదలు ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అగ్రవర్ణ పేదలకు న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థుల ఫీజు చెల్లించాలి

కడప రూరల్ : విద్యార్థులకు సంబంధించిన కళాశాల ఫీజు (ఫీజు రీఎంబర్స్‌మెంట్)లను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ శివశంకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఆంజనేయులు, బీసీ గంగులు, సుబ్బయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

వల్లూరు డిప్యూటీ తహసీల్దార్ అక్రమాలపై విచారణ చేయాలి

కడప కార్పొరేషన్: వల్లూరు డిప్యూటీ తహసీల్దార్ సుహాసిని అక్రమాలపై విచారణ చేయాలని దళిత ఫోరం జిల్లా చైర్మన్ కిశోర్ బూసిపాటి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన జేసీ గణేష్ కుమార్, ఏఎస్పీ లోసారి సుధాకర్‌లను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వల్లూరు మండలం, అంబవరం గ్రామ పొలం , సర్వే నంబర్ 1140–1లో 1.25 ఎకరాల భూమి నల్లపురెడ్డిపల్లెకు చెందిన దరిశ ఏసన్నకు, 1140–3లో 1.20 ఎకరాల భూమి అదే గ్రామానికి చెందిన అక్కిదాసరి ప్రకాశంలకు వారి పూర్వీకుల నుంచి సంక్రమించిందన్నారు. అయితే ఈ రికార్డులన్నీ తోసిపుచ్చి వల్లూరు డిప్యూటీ తహసీల్దార్ డబ్బులు తీసుకొని డి. యేసన్న, ఏ. ప్రకాశంల పేర్లు ఆన్‌లైన్‌లో తొలగించి రికార్డులు తారుమారు చేశారని ఆరోపించారు. ఈ అంశంపై విచారించి న్యాయం చేయాలని కోరారు.

తెగుళ్ల నివారణపై ప్రత్యేక దృష్టి

వీరపునాయునిపల్లె : ప్రస్తుతం సాగులో ఉన్న వేరుశనగ, మినుము పంటలు తెగుళ్ల బారిన పడకుండా ఉండేందుకు నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల వ్యవసాయ అధికారి శ్యామ్ బాబు తెలిపారు. బుధవారం మండలంలోని అనిమెల గ్రామంలో సాగు చేసిన మినుము పంటను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు పడినందున మినుము పంట తెగుళ్ల బారినపడే అవకాశం అధికంగా ఉంటుందన్నారు. పంట లేత దశలో ఉన్న సమయంలో ఆకులపై రంధ్రాలు ఏర్పడటం, మినుము పంటలో పేను, బంక కాండము, పూతపై ఒక పొరలా ఏర్పడి రసం పీలుస్తుంటాయన్నారు. దీన్ని నివారించేందుకు మోనోక్రోటోపాస్ 1.6 మి.లీ లేదా అసిపేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పంటపై పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది రెడ్డెప్ప, రైతులు పాల్గొన్నారు.

జీవ భౌతిక విభాగాల్లో పరిశోధనకు అవకాశాలు

- ఎస్వీయూ భౌతిక శాస్త్ర విభాగం ఆచార్యులు రాజగోపాల్ రెడ్డి

వైవీయూ: జీవ భౌతిక విభాగాల్లో పరిశోధనకు విస్తృత అవకాశాలు ఉన్నాయని తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగ ప్రొఫెసర్ వి. రాజగోపాల్ రెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఫిజికల్ సొసైటీ ఆధ్వర్యంలో ×బయోఫిజికల్ సైన్సెస్ రీసెర్చ్‌లో అవగాహనపై ఒక్కరోజు విద్యావిషయక సంభాషణ (కొలోక్వియం) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫిజికల్ సొసైటీ అధ్యక్షుడు, ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొ.కె. కృష్ణారెడ్డి నేతృత్వం వహించారు. ఫిజిక్స్ ప్రతినిధుల బృందంలో సభ్యులైన తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి విద్యాలయం భౌతికశాస్త్ర విభాగ ప్రొఫెసర్ వి. రాజగోపాల్ రెడ్డి 'సెమీకండక్టర్ పరికరాలు వాటి అప్లికేషన్లు' అన్న అంశంపై విశ్లేషించారు. వివిధ రంగాలలో సెమీకండక్టర్ టెక్నాలజీ పురోగతి ఆచరణాత్మక ఉపయోగాలను వివరించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రఘునాథ రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై మాట్లాడుతూ ఇంటర్ డిసిప్లినరీ పరిశోధన విధానాల ప్రాముఖ్యతను గురించి వివరించారు. తిరుపతి శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాల విశ్రాంత సహ ఆచార్యులు డాక్టర్ ఎన్. నాగరాజు 'పర్యావరణ అవగాహన' అనే అంశంపై ప్రసంగించారు. పర్యావరణ శాస్త్రీయ పరిశోధన, రోజువారీ అభ్యాసాలలో ఏకీకృతం చేయవలసిన అవసరాన్ని గుర్తు చేశారు. శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాల ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ కే. రవీంద్రనాథ్ రెడ్డి , ఫిజిక్స్ సహ ఆచార్యులు డా. వి.వెంకటరాముడు, డా. రాఘవేందర్, ఫిజికల్ సొసైటీ అధ్యక్షుడు, ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొ.కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ కొలోక్వియం అర్థవంతంగా సాగిందని, బయోఫిజికల్ సైన్సెస్ పరిశోధన, దాని అనువర్తనాలపై లోతైన అవగాహనను అందించిందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఇది జ్ఞాన మార్పిడికి వేదికగా పనిచేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పరిశోధకులు, అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.



కొలోక్వియంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

'సీమ' ప్రజల జీవితానికి చిత్రిక పట్టిన రచయిత 'కేతు'

కడప కల్చరల్ : రాయలసీమ ప్రజల జీవితానికి చిత్రిక పట్టిన రచయిత ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి అని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి తెలిపారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో బుధవారం ప్రసిద్ధ కథారచయిత ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి 86వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేతు కడపజిల్లా గ్రామ నామాలపైన లోతైన పరిశోధన చేసి విశిష్టమైన పంథాలో గ్రామ నామాలను, ఆ గ్రామాల జీవన విధానాన్ని, ఆచార వ్యవహారాలను, ఆర్థిక అసమానతలను పరిశీలించి వెలువరించిన అధ్యయన ఫలితాలు ప్రశంసనీయమన్నారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులుగా బ్రౌన్ గ్రంథాలయానికి ఆయన అందించిన సేవలు మరువరానివన్నారు. మరో సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ విశ్వనాథరెడ్డి తాను పుట్టిన నేల, పెరిగిన సమాజం ఈ రెండింటిని ప్రధాన వస్తువుగా చేసుకొని అద్భుతమైన కథలను రాశారని కొనియాడారు. గ్రంథాలయ సహాయకులు ఎస్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి కలిగిన గొప్ప కథా రచయిత కేతు అని, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, వైయస్సార్ జీవన సాఫల్య పురస్కారం వంటి పురస్కారాలెన్నో పొందారన్నారు. ఈ కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



ఆచార్య కేతు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు, సిబ్బంది

ఇసుక అక్రమ రవాణా జరిగితే చర్యలు తప్పవు

కమలాపురం : ఇసుక అక్రమ రవాణా జరిగితే కఠిన చర్యలు తప్పవు అని కడప ఆర్‌డీఓ వెంకటపతి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని రామచంద్రాపురం సమీపంలోని సాండ్ స్టాక్ యార్డును ఆయన పరిశీలించారు. ఇసుక పంపిణీ విధానంపై ఆరా తీశారు. ఇసుక అక్రమ రవాణ జరగకుండా చర్యలు తీసుకోవాలని, అక్రమ రవాణ జరిగినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఒక ఆధార్ కార్డు కేవలం 20 టన్నులు మాత్రమే ఇసుక ఇవ్వాలన్నారు. అదీ కూడా అవసరమైన వారికే ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇసుక లోడింగ్ చేయాలన్నారు. మీసేవ ద్వారా నమోదు చేసుకున్న ఆన్‌లైన్ స్లిప్పులు తీసుకుని వచ్చిన వారికే ఇసుక ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఏపీఎం అపర్ణదేవి, ఆర్ఐ అర్జున్, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

పెండ్లిమర్రి : ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారి ఓబులేసు తెలిపారు. బుధవారం మండలంలోని శ్రీనివాసపురం గ్రామ పొలాల్లో సాగు చేసిన సజ్జ పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సజ్జ పంటకు చీడపీడలు, తెగుళ్ల రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు 552 హెక్టార్లల్లో వరి, మినుము, సజ్జ, కొర్ర, వేరుశనగ పంటలు సాగు చేశారన్నారు. పంటలకు సంబంధించిన ఎమైనా సలహాలు, సూచనలు కావాలంటే రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి సిబ్బందితో మాట్లాడి సమస్యను వివరించి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ గంగాధర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతుల రుసుం చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో 1998, 2008 డీఎస్సీకి సంబంధించిన ఎంటీఎస్ ఉపాధ్యాయులకు వేసవిలో నిర్వహించిన శిక్షణా తరగతులకు సంబంధించిన రుసుం వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు కోరారు. ఈ విషయమై బుధవారం డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్‌కు ఎంటీఎస్ ఉపాధ్యాయులతో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ ఖాజీపేట మండల అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఎంటీఎస్ ఉపాధ్యాయులు సుబాన్ బాష, వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేడీమేడ్ షాపులో చోరీ

కడప అర్బన్: కడప నగరంలోని ఆర్‌కెపిఎం స్ట్రీట్‌లో వున్న ఓ రెడీమేడ్ షోరూంలో గుర్తు తెలియని వ్యక్తులు గత రాత్రి చొరబడి 10 షర్ట్‌లు, 10 ఫ్యాంట్‌లు ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం షాపులోకి అడుగుపెట్టగానే చిందరవందరగా వస్తువులన్నీ పడిపోయి ఉన్నా యని బాధితుడు షామీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దాం

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు చదువుతోపాటు ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థి దశ నుంచే నేర్చుకోవాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు పిలుపునిచ్చారు. బుధవారం కడప ఐటీఐ కళాశాలలో నగర ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో విద్యారంగంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. మార్పులకు అనుగుణంగా పిల్లలు సిద్ధం కావాలన్నారు. టీడీపీ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలన్నారు. అలాగే డిగ్రీ ప్రవేశాలను ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి ఆఫ్‌లైన్ విధానంలో అమలు చేయాలన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా విశ్వ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

నూతన నగర కమిటీ ఎన్నిక...

గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో నగర అధ్యక్షులు నవీన్, నగర కార్యదర్శి శెట్టిపల్లి రెడ్డిసాయి, ఉపాధ్యక్షులు ఇర్ఫాన్, పవన్, సురేష్, సహాయ కార్యదర్శిగా నాగమునయ్య, భరత్, కమిటీ సభ్యులు వెంకటేష్, లోకేష్, ప్రసాద్‌లతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాలేటి వాగు రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని చక్రాయపేట మండలంలో అసంపూర్తిగా ఉన్న కాలేటివాగు రిజర్వాయర్ మిగిలిన పనులను సత్వరమే పూర్తి చేసి ప్రజల తాగు, సాగునీటి అవసరాలు తీర్చాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణరెడ్డి కోరారు. బుధవారం కడప నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మన జిల్లాకు చెందిన బీజేపీ నాయకులు సీఎం రమేష్ ఇటీవల జరిగిన ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీగా విజయం సాధించి తొలిసారిగా ఈనెల 12న జిల్లాకు వస్తున్నారన్నారు. ఆయన తొలుత కడప పెద్దదర్గా, దేవునికడప ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మైదుకూరు, ప్రొద్దుటూరులో పర్యటిస్తారన్నారు. ఈ క్రమంలో తమ పార్టీ కేంద్ర, రాష్ట్ర నాయకులు, జిల్లా ప్రజలతో కలిసి ఈ ప్రాజెక్టును సందర్శించనున్నామని తెలిపారు. కాలేటి వాగు పనులు సత్వరమే ప్రారంభించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుల బొమ్మన విజయ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బత్తల పవన్‌కుమార్, నాయకులు లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్‌రెడ్డి